**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 04.07.2026** **సమయం: 13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 20 ఏళ్ల ప్రజా జీవితాన్ని గుర్తు చేసుకుంటూ.. ప్రజల ఆశీస్సులతో సేవా ప్రస్థానాన్ని కొనసాగిస్తానని అన్నారు.
2. పర్యాటక, ఆతిథ్య రంగంలో తెలంగాణ అమలు జరుపుతున్న సంస్కరణలను నీతి ఆయోగ్ ప్రశంసించడం పట్ల పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు.
3. పోలీస్ శాఖలో 20 వేల ఖాళీలకు గాను 5 వేల పోస్టులకే అనుమతి ఇవ్వడం పట్ల బీజేపీ శాసన పక్షం నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నిరసన వ్యక్తం చేశారు.
4. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నేటి నుంచి మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

……………………………………………………

**CM TOUR…**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో పర్యటించనున్నారు. 2006లో మిడ్జిల్ జడ్పీటీసీగా తొలి విజయం సాధించిన రేవంత్ రెడ్డి, అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీగా ఎన్నికై, 2023లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మిడ్జిల్ పర్యటనలో భాగంగా ఊర్కొండపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. తొలి రాజకీయ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన

నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారు. మిడ్జిల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, స్థానిక నాయకుడు ద్యాప గోపాల్ రెడ్డి విగ్రహాలను ఆవిష్కరిస్తారు. స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో తన రాజకీయ ఎదుగుదలకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

(DESK)

**CM MESSAEGE...**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 20 ఏళ్ల ప్రజా జీవితాన్ని గుర్తు చేసుకున్నారు. మిడ్జిల్‌లో రాజకీయ ప్రస్థానం ప్రారంభమైన రోజు నుంచి ప్రజల హృదయాల్లో "రేవంతన్న"గా నిలిచిన ఈ ప్రయాణం తన జీవితంలో ప్రత్యేక అధ్యాయమని పేర్కొన్నారు. ఈ రెండు దశాబ్దాల కాలంలో ప్రతి పోరాటంలో తనకు అండగా నిలిచిన ప్రజలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, పార్టీ కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రజాసేవను మరింత విస్తరించేందుకు కృషి చేస్తానన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో శ్రామికుడిగా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సేవకుడిగా మరింత బాధ్యతతో పనిచేస్తానని, ప్రజల హృదయాల్లో "రేవంతన్న"గా తన స్థానాన్ని మరింత బలపరచుకుంటానని స్పష్టం చేశారు.

(DESK)

**JUPALLY – TOURISUM...**

పర్యాటక, ఆతిథ్య రంగ అభివృద్ధిలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలను నీతి ఆయోగ్ ప్రశంసించడం రాష్ట్రానికి గౌరవకారణమని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఇటీవల విడుదల చేసిన  పర్యాటక, ఆతిథ్య రంగాల వృద్ధికి అవకాశాల విస్తరణ  అనే నివేదికలో తెలంగాణ పర్యాటక విధానాలను నీతి ఆయోగ్ ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు మంత్రి ఒక ప్రకటనలో తెలియచేశారు. తెలంగాణ పర్యాటక విధానం

2025–2030కి దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ప్రపంచ స్థాయి పర్యాటక మౌలిక వసతులతో తెలంగాణను దేశంలోనే అగ్రగామి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

(DESK)

**KARIMNAGAR – ADI SRINIVAS**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మూడపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యారంగంలో సమూల మార్పులు వస్తున్నాయని అన్నారు. దాదాపు 200 కోట్ల వ్యయంతో 2,600 మంది విద్యార్థులకు వసతి, విద్య, భోజన సదుపాయాలతో ఈ పాఠశాలను నిర్మిస్తున్నామని చెప్పారు. స్కూల్ నిర్మాణాలను 16 నుంచి 18 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

(PTC)

**DY CM – ALLURI ....**

స్వాతంత్ర సమరయోధుడు, 'మన్యం వీరుడు' అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి వాకిటి శ్రీహరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆశయాలను స్మరించుకుంటూ, వారి త్యాగస్ఫూర్తి భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని క్షత్రియ సేవా సమితి బహుకరించిన అంబులెన్స్‌ను మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ అధికారులకు అందజేశారు.

( DESK)

**ECI...**

భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిన్న న్యూఢిల్లీలో జరిగిన మీడియా, కమ్యూనికేషన్ నోడల్ అధికారుల జాతీయ సదస్సులో తెలంగాణ సమాచార, పౌరసంబంధాల శాఖకు చెందిన జిల్లా ప్రజా సంబంధాలు, మీడియా, సోషల్ మీడియా నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ.... స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికల నిర్వహణలో మీడియా, ప్రజా సంబంధాల అధికారుల పాత్ర కీలకమన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొంటూ అధికారిక సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో డిజిటల్ సాంకేతికత వినియోగం, సోషల్ మీడియా సవాళ్లు, పెయిడ్ న్యూస్ నియంత్రణ, ఓటరు సేవలను ఒకే వేదికపై అందిస్తున్న ఈసీఐనెట్ వినియోగంపై అధికారులు అవగాహన కల్పించారు.

( DESK)

**PONNAM - KOMARAIAH**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా రవీంద్రభారతిలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులర్పించారు. దొడ్డి కొమురయ్య ఆశయాలైన సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవాన్ని భావితరాలకు చేర్చడం అందరి బాధ్యత అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. విద్యే సామాజిక వర్గాల అభివృద్ధికి ప్రధాన మార్గమని, ఉన్నత విద్యతోనే అన్ని రంగాల్లో పురోగతి సాధ్యమని మంత్రి పేర్కొన్నారు.

( PTC)

KARIMNAGAR - NO PLASTIC...

కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం కోనేరుపల్లి గ్రామం ప్లాస్టిక్ రహిత గ్రామంగా అధికారులు ప్రకటించారు. ప్లాస్టిక్ నిషేధం పై ముందుగా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వేస్ట్ పై గ్రామ పంచాయతీ ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా గ్రామీణభివృద్ధి సంస్థ అధికారి గీత మాట్లాడుతూ... గ్రామంలో సింగల్ యూస్ ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేదించాలని నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

**బైట్ – గీత, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి**

(PTC)

**BJP – MAHESHWAR REDDY**

తెలంగాణ పోలీస్ శాఖలో సుమారు 20 వేల ఖాళీలు ఉండగా ప్రభుత్వం కేవలం 5 వేల పోస్టులను మాత్రమే భర్తీ చేయడానికి అనుమతించడం సహేతుకమైన చర్య కాబోదని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ఎక్స్ వేదికగా విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు పోస్టుల సంఖ్యను పరిమితం చేయడం సరికాదన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న పోలీస్ ఉద్యోగార్థుల పోరాడాలకు బీజేపీ మద్దతు ఉంటుందన్నారు.

( DESK)

**SANGAREDDY – COLLECTOR VISIT...**

సంగారెడ్డిలోని సర్ సి.వి. రామన్ సైన్స్ మ్యూజియంను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సైన్స్ ప్రయోగశాలలను సమర్థవంతంగా వినియోగించి విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని ఉపాధ్యాయులకు

సూచించారు. పరిసరాల్లో లభ్యమయ్యే వస్తువులను ఉపయోగించి నిజజీవితానికి అనుసంధానించే విధంగా బోధన చేపట్టాలన్నారు. సర్ సి.వి. రామన్ సైన్స్ మ్యూజియంను సందర్శించదలిచిన పాఠశాలలు ముందస్తుగా జిల్లా సైన్స్ అధికారిని సంప్రదించి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు

.( PTC)

**MULUGU – EDUCATION...**

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామంలో ప్రైవేట్ పాఠశాలలు, వాటి వాహనాలకు గ్రామస్తులు నో ఎంట్రీ విధించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించడంతో విద్యార్థుల సంఖ్య 13 నుంచి 126కు పెరిగింది. ఈ సందర్భంగా డీఈవో జీ. సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ... ఇది ప్రభుత్వ విద్య బలోపేతానికి శుభపరిణామమని అన్నారు.

( PTC)

**బైట్... డీఈవో జీ. సిద్ధార్థ రెడ్డి**

**ASIFABAD – SIR....**

తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దు కెరమెరి మండలంలోని 11 గ్రామాల్లో "సర్" ప్రక్రియపై నెలకొన్న సందిగ్ధత తొలగించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావు, స్థానిక తహసీల్దార్‌తో కలిసి పరండోలి, ముఖదంగూడా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి "సర్" ఫారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతుల భూ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పహానీలు, పంట రుణాలు, పట్టాలు, రైతు భరోసా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ 11 గ్రామాల ప్రజలు ప్రస్తుతం రెండు రాష్ట్రాల సంక్షేమ పథకాలు పొందుతూ, రెండు రాష్ట్రాల్లోనూ ఓటు హక్కు వినియోగిస్తున్నారు

.(PTC)

**NALGONDA - UTHAM**

విధి నిర్వహణలో ఉండగా మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటామని రాష్ట్ర సాగు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రెవెన్యూ శాఖలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన పలువురు అభ్యర్థులకు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి నియామక పత్రాలను నిన్న సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...చనిపోయిన ఉద్యోగుల వారసులకు అర్హతను బట్టి జూనియర్ అసిస్టెంట్లుగా, ఆఫీస్ సబార్డినేట్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కొత్తగా ఉద్యోగ నియామ పత్రాలు అందుకున్న వారు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

( PTC)

**TS RAINS...**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో నేటి నుంచి మూడు రోజుల పాటు తెలంగాణ లోని పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ అల్పపీడనం రాబోయే రెండు రోజుల్లో తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశముందని వెల్లడించింది. నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, ఆదిలాబాద్, కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. మరో వైపు నిన్నటి నుండి పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసిందని తెలిపింది. ఈ నెల రెండో వారంలో రాష్ట్ర వ్యాప్తంగా సాధారణం కన్నా అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలియచేసింది.

(DESK)